క్లుప్తంగా

నేడు ఐటీడీఏ వద్ద ధర్నా

బజార్‌హత్నూర్: కుడ్మెత జంగుబాయి హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబానికి న్యాయం చేయాలని ఈనెల 7న ఉదయం 11 గంటలకు ఉట్నూర్ ఐటీడీఏ వద్ద బీర్డుగోండు, తోటి యువసేన ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తోటి యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చాకటి మహేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు సైతం సాయి, ఛత్రపతి, బాలు, గోపాల్, మల్లేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న డివిజన్ ఉద్యమ దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేస్తున్న దీక్షలు ఆదివారానికి 21వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నక్కల కులసంఘం నాయకులు కూర్చున్నారు. బోథ్ డివిజన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని డివిజన్ సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. గద్దర్ మృతి చెందడంతో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నక్కల సంఘం సభ్యులు, బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ పురుగుల మందు విక్రయించారని ఫిర్యాదు

బోథ్: మండల కేంద్రంలోని మల్లికార్జున ఫర్టిలైజర్స్ దుకాణంలో కొనుగోలు చేసిన కెమిడైస్ కంపెనీకి చెందిన కాన్ఫరెన్స్ సూపర్ అనే పురుగుల మందు నకిలీదని రైతు బాబు ఆరోపించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3న ఫర్టిలైజర్స్ దుకాణంలో పురుగుల మందును కొన్నానని, మందును తీసి చూడగా గట్టిపడి ఉందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కంపెనీ నుంచి అలానే వచ్చిందని, సదరు దుకాణదారు పేర్కొన్నట్లు తెలిపారు. ఈవిషయమై ఏవో విశ్వామిత్రకు ఫిర్యాదు చేశారు. దుకాణంలోని మందులను ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

కోటి పార్థీవ లింగార్చన

బోథ్: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కోటి పార్థీవ లింగార్చన మహోత్సవాన్ని స్వప్న జిన్నింగ్‌లో ఘనంగా నిర్వహించారు. బాసర క్షేత్ర స్థిత శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో దీపారాధన, కలశస్థాపన, పంచామృత అభిషేకం, మహా రుద్రాభిషేకం, భస్మార్చన, పుష్పార్చన, బిల్వార్చన, గోపూజ, ధూపదీప, నైవేద్యాలు, గురుపాద పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, ధనలక్ష్మి, నందన, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

జైనథ్: మండల కేంద్రంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, బోనాలు సమర్పించారు.

టార్పాలిన్, వంట సామగ్రి అందజేత

బేల: మండలంలోని వరూర్(కె) గ్రామంలో ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన కుటుంబాలకు ఆదివారం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున టార్పాలిన్, వంట సామగ్రిని అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గంగేశ్వర్, మండల కోఆర్డినేటర్ సామ రూపేష్‌రెడ్డిలు మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ్‌బాబు, ఉప్పుల కిషన్, బత్తుల నరేశ్, కుంట కిరణ్‌కుమార్, గైక్వాడ్ ప్రవీణ్‌కుమార్, టేకాం అయ్యూ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఎస్సై ఉద్యోగానికి ఎంపిక

బోథ్: ఎస్సై పరీక్ష ఫలితాల్లో బోథ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన అనుమల కృష్ణకాంత్ ఫైర్ విభాగంలో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కృష్ణకాంత్‌కు 400 మార్కులకు గాను 230 మార్కులు సాధించాడు. రెండు నెలల క్రితం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌గా ఉద్యోగం వచ్చింది. ఆదివారం వెలువడిన ఎస్సై ఫలితాల్లో ఫైర్ విభాగంలో ఎస్సైగా ఉద్యోగం సాధించాడు.

గద్దర్‌కు నివాళి

ఉట్నూర్‌రూరల్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ మృతి సమాజానికి తీరని లోటని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఐబీలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం భుజంగ్‌రావు, శామ్యూల్, ఆత్రం సుగుణ, ప్రజ్ఞశీల్, వెంకటేశ్వర్, గణేశ్, అరవింద్, కరీం, జ్ఞానేశ్వర్, శేషు పాలొన్నారు.

జయశంకర్ సార్‌కు నివాళి

- ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, నాయకులు



బోథ్: సొనాలలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



కైలాస్‌నగర్: పూలమాల వేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయసాధనకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ బండారి సతీశ్, సాజిదోద్దీన్ పాలొన్నారు.

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణచౌక్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు. రైల్వే బోర్డు సభ్యులు జీవి రమణ, గన్నోజి విజయ్, రాజు యాదవ్, నారాయణ రెడ్డి, ముఖీం, కాంత, శివకిరణ్, రోహిదాస్ పాల్గొన్నారు.
- సనాతన హిందూ ఉత్సవ సమితి, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రమోద్, సుభాష్, సత్యనారాయణ, జగదీశ్, స్వదీప్ సింగ్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, ఎంపీవో సుమీర్ హైమద్, జక్కుల మధుకర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, ప్రమోద్‌రెడ్డి, ఠాక్రే మంగేష్, కొరంగే జంగ్‌షా, గోడం సునీల్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో జయశంకర్ చౌక్‌లో జయశంకర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నేతకాని మహార్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మహేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ సహకారానికి బాటలు వేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రవికాంత్, అంబాదాస్, వేమయ్య, మంత్రి రాజ్‌కుమార్, భాలేరావు, రాహుల్, జోలి నరేశ్, సాయికిరణ్, వాజిద్ పాల్గొన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో..

ఉట్నూర్ ఐటీడీఏలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో జనరల్ నాగోరావు, ఈఈటీడబ్ల్యూ భీంరావు, ఏవో రాంబాబు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రంథాలయశాఖ అధికారి కాంబ్లే వెంకటి, సోన్‌కాంబ్లే మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి ఎంపీపీ రత్నప్రభ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్, పంచాయతీరాజ్ డీఈ శివరాం, సర్పంచ్‌లు లింబాజీ, కృష్ణ, బదర్, భోజన్నయాదవ్, పాండ్‌రంగ్ పాల్గొన్నారు.



తాంసి: భీంపూర్‌లో..

నేరడిగొండ: రాష్ట్ర ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఆచార్య జయశంకర్ సార్ అని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. ఆదివారం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, భీంరావు, మండాడి కృష్ణ, కరణ్‌సింగ్, జ్ఞానేశ్వర్, అల్వే శేఖర్, సిబ్బంది పాల్గొనాలన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా జయశంకర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. సొనాలలో టీఎస్‌జీవో అధ్యక్షుడు గాజుల పోతన్న, బత్తుల రమేశ్‌ల ఆధ్వర్యంలో, మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు, బోథ్ బస్టాండ్ వద్ద టీజీవీపీ నాయకులు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



బేల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఠాక్రే వనిత



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న ఎంపీపీ



ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ కార్యాలయంలో..

గాంధీభవన్ సమావేశంలో కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ బీఎల్‌ఏ ఏజెంట్ల ద్వారా సమావేశం నిర్వహించారు. మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీలు, డీసీసీ అధ్యక్షులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ గురించి చర్చించడం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ తెలిపారు.

బోథ్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో మండల నాయకులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటర్ లిస్టుపై అవగాహన, బీఎల్‌వో, బీఎల్‌ఏల పనితీరుపై చర్చించారు. బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, పసుల చంటి, కుర్మె మహేందర్, మహిమూద్ ఖాన్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

యువత కలిసికట్టుగా ఉండాలి

నేరడిగొండ: యువత కలిసికట్టుగా ఉండి అభివృద్ధికి సహకరించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన యూత్ సభ్యులు నేరడిగొండలోని ఆయన నివాసంలో కలిశారు. కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. యువకులు వినయ్, ఆఫ్రిద్, దినేష్, అలీమ్, సభ్యులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. అధికారులు, సభ్యులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు సైతం హాజరుకాకపోవడంతో గంటలోనే సమావేశం ముగించారు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మొదటగా వ్యవసాయశాఖ చెందిన ఏఈవో శంకర్ మాట్లాడుతూ.. మండలంలో వరదల వలన 3900 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఏఈ మాట్లాడుతూ.. సుండికిలో సంప్ నిర్మాణం జరుగుతుండటంతో నీటి సరఫరాలో జాప్యం జరుగుతుందన్నారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రావణ్ మాట్లాడుతూ.. వరదల కారణంగా మండలంలో 9 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 60 స్తంభాలు విరిగినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారి గులాబ్ మాట్లాతుండగా.. జెడ్పీటీసీ సుధాకర్ జోక్యం చేసుకొని అర్లి(టి) శివారులోని అటవీ భూములను సాగుచేస్తున్న గిరిజనులకు పోడుపట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పంచాయతీరాజ్, పౌరసరఫల శాఖ, ఆరోగ్య, విద్య, ఐకేపీ, ఐసీడీఎస్, పశుపోషణ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్, పంచాయతీరాజ్ డీఈ శివరాం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రత్నప్రభ

చెరువులకు జలకళ



వేసవిలో ఎండిపోయిన చెరువు



ప్రస్తుతం నిండుకుండలా గంగన్నపేట చెరువు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఏటూ చూసినా.. నిండు కుండలా చెరువులు దర్శనమిస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని లక్కారం గంగన్నపేట చెరువు వేసవి కాలంలో ఎండిపోయి దర్శనమివ్వగా.. ప్రస్తుతం నిండుకుండలా మారింది.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేద ప్రజలకు సేవ చేయాలనే తపనతో గత 124 వారాలుగా సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని నిర్వాహకులు సుధీర్ కుమార్ సంగెం తెలిపారు. ట్రస్ట్ సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, రాజయ్య, లఖన్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినయ్‌రెడ్డి

బోథ్: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోథ్ మండలంలోని ధన్నూర్ (బి) గ్రామానికి చెందిన ఎల్మ వినయ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదిలాబాద్‌లో జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ రాథోడ్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, నల్ల శ్రీకాంత్ రెడ్డి, బద్దం సాయికిరణ్ రెడ్డి, సునీల్‌రెడ్డి, పోతారెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలీ కార్యవర్గం ఎన్నిక

జైనథ్: పద్మశాలీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు మంచికట్ల ఆశమ్మ, తాలుక అధ్యక్షుడు బొమ్మకంటి రమేశ్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా తలకొక్కుల రామన్న, ప్రధాన కార్యదర్శిగా మోర శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

సన్మానం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ కమిటీ సభ్యులను ఆదివారం సన్మానించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాగ్మారే భీంరావ్, దాదాసాహెబ్, సోన్‌కాంబ్లే మనోహర్, కామ్రాజ్, వాగ్మారే జగ్జీవన్, ప్రజ్ఞశీల్, దీలిప్, సునీల్, శివాజీ, సత్యానంద్, సంతోశ్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఉట్నూర్‌రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. ఆ దివారం ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల వల్ల కలిగే లాభాలను వివరించారు. తనసొంత ఖర్చులతో బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగించాలన్నారు. ఆమె వెంట డాక్టర్ మహేందర్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక కౌంటర్

ఆదిలాబాద్: దివ్యాంగుల కోసం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక బస్‌పాస్ కౌంటర్ ఏ ర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



గౌడ సంఘం స్టిక్కర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్‌రూరల్: గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గౌడ సంఘం భవన ప్రారంభోత్సవ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. అంతకుముందు సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూజ చేసి గౌడ సంఘం లేబుల్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆర్.రమేశ్‌చందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అంజన్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు నాందేవ్‌గౌడ్, నర్సాగౌడ్, శంకర్ గౌడ్, సంతోష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, భూపతిగౌడ్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి

కైలాస్‌నగర్: యువత రక్తదానానికి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణానికి చెందిన గజేంద్రనాయుడు జయంతిని పురస్కరించుకొని ఆయన సోదరుడు గణేష్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మెగా రక్తదాన శిబిరానికి హాజరై ప్రారంభించారు. అనంతరం నూతన అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో జోగు మహేందర్, చిన్న పటేల్, రవి నాయుడు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఇంద్రవెల్లి: ఐపీఎస్‌వోఎస్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల బృందం సభ్యులు ఆదివారం మండలంలోని తేజాపూర్, ఇంద్రవెల్లి, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన అభివృద్ధి పనులు, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. కంపోస్ట్ షెడ్డులో సేకరించిన తడి, పొడి చెత్తల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ నిర్మించిన ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ షో పీట్, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నవీన్‌తేజ, వెంకటేశ్, గణేశ్, డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, ఈవో సంజీరావు పాల్గొన్నారు.



ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న సభ్యులు

కనక లక్కేరావ్ సేవలు మరువలేనివి

ఇంద్రవెల్లి: ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కనక లక్కేరావ్ ఆదివాసీ సమాజ్ కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎంపీ సోయం బాపురావ్, మాజీ విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డిలు అన్నారు. ఆదివారం వేర్వేరుగా మండలంలోని తుమ్మగూడ గ్రామాన్ని సందర్శించి కనక లక్కేరావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, డీసీఎంఎస్ డైరెక్టర్ గోవర్ధన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మాజీ ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, కోవ రాజేశ్వర్, ఆర్క ఖము, తోడసం నాగోరావ్, నాగ్‌నాథ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ సోయం బాపురావ్

వైద్య శిబిరం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్పంచ్ కోరెంగా గాంధారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మమత, నియోకేర్ ఆస్పత్రిల వైద్యుడు శ్రీధర్‌రెడ్డి, సిందూరెడ్డిలు హాజరై 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

భగీరథ నీటి సరఫరాకు బ్రేక్



కొనసాగుతున్న పైప్‌లైన్ మరమ్మతులు

- తరోడ వంతెన వద్ద కొట్టుకుపోయిన పైప్‌లైన్
- బేల, జైనథ్ మండలాల్లో 98 గ్రామాలకు సరఫరా బంద్
- కొనసాగుతున్న మరమ్మతులు

బేల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు బ్రేక్ పడింది. జైనథ్ మండలంలోని 353బీ జాతీయ రహదారి మార్గంలోని తరోడ వంతెన వద్ద వరద భగీరథ ప్రధాన పైప్‌లైన్ కొట్టుకుపోయింది. దీంతో బేల, జైనథ్ మండలాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చేతిపంపులు, బావుల వద్ద నీటికోసం తిప్పలు పడుతున్నారు. గత మూడు రోజుల నుంచి అధికారులు పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయిస్తున్నారు. మరమ్మతు పూర్తయ్యేందుకు మరో పది రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

98 గ్రామాలకు అందని నీరు..

జైనథ్ మండలంలోని తరోడ వంతెన వద్ద 320 మీటర్ల వరకు భగీరథ ప్రధాన పైప్‌లైన్ కొట్టుకుపోయింది. దీంతో బేల మండలంలో 56 గ్రామాలతో పాటు జైనథ్ మండలంలో 42 గ్రామాలకు నీటి సరఫరా బంద్ అయింది. ప్రజలు ప్రత్యామ్నాయంగా చేతిపంపుల వద్ద నీటిని పట్టుకుంటున్నారు.

కొనసాగుతున్న మరమ్మతులు..

అధికారులు నూతన డీఐ (డక్టాయిల్ ఐరన్) పైప్‌లను సరఫరా చేయించారు. మూడు రోజులుగా సాంకేతిక, ఎలక్ట్రికల్ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. పైప్‌లైన్ గతంలో వంతెన కింది భాగాన వాగులో నుంచి ఉండగా, నూతన పైప్‌లైన్‌ను తాత్కాలికంగా వంతెనపై నుంచి ఏర్పాటు చేయిస్తున్నారు. పనులు పూర్తయ్యేందుకు మరో పది రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ట్రయల్‌రన్ పరిశీలన తర్వాతే నీళ్ల సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

పది రోజుల్లో మరమ్మతులు పూర్తి

జైనథ్ మండలంలోని తరోడ వంతెన వద్ద గత మూడు రోజుల నుంచి భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు కొనసాగుతున్నాయి. మరో పది రోజుల్లో మరమ్మతులు పూర్తికానున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పరిశీలన పూర్తయిన తరువాతే నీటి సరఫరా పునరుద్ధరిస్తాం.

– శాంతికుమార్, ఏఈ గ్రామీణ నీటి సరఫరాశాఖ, బేల